ప్రజలే మా బలగం

- పేదల బాగు కోరిన జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలి
- జగనన్న జనబలం ముందు కూటమి కుట్రలు చెల్లవు
- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్
- నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం
- అడుగడుగునా ప్రజల బ్రహ్మరథం


30వ వార్డులో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్, పార్టీ నేతలు


మంథావారి వీధిలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్


ఫ్యాన్ గుర్తు చూపిస్తున్న వృద్ధురాలు


వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని బుర్ర కథ ద్వారా ప్రచారం


30వ వార్డులో నిర్వహించిన వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రచార కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు


ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్‌లకు గజమాలతో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

మహారాణిపేట : పాఠశాలకు వెళ్లే పిల్లలనుంచి పెన్షన్ తీసుకునే వృద్ధుల వరకు సంక్షేమ పథకాలతో మేలు చేసిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయితే ప్రజలు సంతోషంగా ఉంటారని వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బొత్స ఝాన్సీ, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు. పేదప్రజలు బాగుండాలన్న ఏకైక లక్ష్యంతో జగనన్న ఐదేళ్లు పాలన అందించారన్నారు. సోమవారం 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం(కొండమ్మ) ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బొత్స ఝాన్సీ, వాసుపల్లి గణేష్ కుమార్‌లకు పార్టీ నేతలు గజమాలతో సత్కరించారు. మహిళలు హారతులిచ్చి అఖండ స్వాగతం పలికారు. ప్రచార కార్యక్రమానికి అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, దక్షిణ పార్టీ పరిశీలకుడు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, డాక్టర్ జహీర్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ జగనన్న చేపట్టిన సిద్ధం బస్సు యాత్రకు అనూహ్య స్పందన రావడంతో కూటమి నేతల్లో కలవరం మొదలైందని, ఇది ఓర్వలేకే భౌతిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. జగనన్న జనబలం ముందు కూటమి నేతలు ఎన్ని కుట్రలు చేసినా ప్రయోజనం ఉండదన్నారు. కూటమి పార్టీలకు డిపాజిట్లు కూడా కోల్పోయే పరిస్థితి వస్తుందని చెప్పారు. కురుక్షేత్రంలో అర్జునుడికి కృష్ణుడిలా జగనన్నకు ప్రజలంతా తోడు కావాలన్నారు. మీ అభిమానంతో వాసుపల్లి హ్యాట్రిక్ కొట్టాలని, ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థిగా తనను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. విశాఖ సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తేలా ఆశీర్వదించాలని బొత్స ఝాన్సీ విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ 30వ వార్డులో ప్రజలంతా తమవైపే ఉన్నారని, వారి ఆదరాభిమానాలు ఎప్పటికీ మర్చిపోనన్నారు. ప్రతి గడప కష్టాలు తీర్చే విధంగా కార్పొరేటర్ కొడూరు అప్పలరత్నం కృషి చేశారన్నారు. జగనన్నకు ధైర్యం ప్రజలేనని, విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఉన్న ముస్లిం మైనారిటీలు, రెల్లి కులస్తులు, మత్స్యకారులు, బీసీలు వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మరోసారి సీఎంగా జగనన్న ప్రమాణ స్వీకారం చేస్తారని వాసుపల్లి జోస్యం చెప్పారు. ప్రచారం తాడి వీధి నుంచి ప్రారంభించి మానస హోటల్, లేపాక్షి మెయిన్ రోడ్, ఆంజనేయ స్వామి దేవాలయం, రజకవీధి, మంతావారి వీధి, వార్డు బాయ్స్ కాలనీ, కేజీహెచ్ నుంచి కలెక్టర్ ఆఫీసు, అఫీషియల్ కాలనీ నుంచి జాలారిపేట మెయిన్ రోడ్, కోడి పందాల వీధి, ఎగువ రెల్లి వీధి, అంబేడ్కర్ విగ్రహం వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వద్దాది మధుసూధన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, పార్టీ వార్డు సీనియర్ నాయకులు దశమంతుల మాణిక్యాలు, పెంటపల్లి సత్యనారాయణ, దశమంతుల చిన్ని, ఆనంద్, దిలీప్, వెంకట అప్పారావు, శంకరరావు, రవితేజ, రాము, సీత రామలక్ష్మి, మణి, మీన, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లికి ఆర్మీ మాజీ మేజర్ మద్దతు


వాసుపల్లికి మద్దతు తెలియజేస్తున్న పంజాబ్ మాజీ మేజర్, వేదాంత చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మంజోత్ సింగ్

అల్లిపురం: నిస్పక్షపాతంగా ప్రజలకు సేవ చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్‌కు పంజాబ్ మాజీ మేజర్, వేదాంత చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మంజోత్ సింగ్ సెల్యూట్ చేసి తన మద్దతు తెలిపారు. ఆశీలమెట్ట కార్యాలయంలో సోమవారం ఆయన వాసుపల్లిని కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణంలో పేద ప్రజలకు చేస్తున్న సేవలే మళ్లీ వాసుపల్లి గెలిపిస్తాయన్నారు. వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రధాన భూమిక పోషించిన వారు తనకు మద్దతు తెలపడం రెట్టింపు ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. జగనన్న ఆశయమే లక్ష్యంగా తాను నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రెల్లి సామాజికి వర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

మహారాణిపేట: ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రాష్ట్ర వ్యాప్తంగా రెల్లి కులస్తులకు రెండు ఎమ్మెల్సీ పదవులివ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద రెల్లి పొలిటికల్ జేఏసీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు ఆధ్వర్యంలో రెల్లి కుల ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు రెల్లి సామాజిక వర్గాన్ని ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర రెల్లికుల సంఘం ప్రతినిధి ఎస్. మోహన్ కుమార్ , మామిడి కనకారావు, జయరావు, ఉమా శంకర్, సీహెచ్ మహేష్ ప్లకార్డులు ప్రదర్శించారు.

క్లుప్తంగా

మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం


పెందుర్తి లయోలా ఓల్డ్ ఏజ్ హోం ప్రతినిధికి మమతను అప్పగిస్తున్న వాసు

అల్లిపురం: మతిస్థిమితం లేకుండా రోడ్డుపై అర్ధనగ్నంగా తిరుగుతున్న మహిళకు జీవీఎంసీ ఏయూటీడీ ప్రతినిధులు ఆశ్రయం కల్పించారు. స్థానికుల సమాచారంతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు ఆమెను తమ సిబ్బందితో కలిసి చినవాల్తేరులోని మానసిక దివ్యాంగుల ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందజేశారు. ఆమె ఆరోగ్యం మెరుగుపడింది. ఆమె పేరు మమత అని మాత్రమే తెలియజేసింది. ఊరు పేరు చెప్పకపోవడంతో ఆమెను టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని మహిళా షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. సోమవారం పెందుర్తిలో గల లయోలా ఓల్డ్ ఏజ్ హోంలో చేర్పించినట్లు ఆయన తెలిపారు.

కఫం నమూనాల సేకరణ


ఎరుకలవీధిలో మహిళ నుంచి కఫం నమూనా సేకరిస్తున్న రత్నం, ఆశ వర్కర్ లీలావతి

అల్లిపురం: దగ్గు, షుగర్ వ్యాధులతో బాధపడుతున్నవారి నుంచి భీమ్‌నగర్, టీబీ నివారణలో భాగంగా సోమవారం కఫ నమూనాలు సేకరించారు. టీబీ హెచ్‌వీ రత్నం ఆధ్వర్యంలో కొబ్బరితోట ఆశ వర్కర్ బుద్ద లీలావతితో కలిసి ఎరుకలవీధి, మిరపకాయలవీధి ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి 150 మంది నుంచి కఫ నమూనాలు సేకరించినట్లు ఆమె తెలిపారు. వాటిని ల్యాబ్‌లో టెస్ట్ చేసిన తరువాత వచ్చిన ఫలితాల ఆధారంగా వారికి వైద్యం అందజేస్తామన్నారు. ఎక్కువ కాలంగా దగ్గు, జ్వరంతో బాధపడుతున్నవారి నుంచి ఈ నమూనాలు సేకరించినట్లు తెలిపారు.

వాసుపల్లికి మత్స్యకారుల సంక్షేమ సేవా సంఘం మద్దతు


వాసుపల్లికి మద్దతు తెలుపుతున్న సంఘం ప్రతినిధులు

దాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు మత్స్యకారుల సంక్షేమ సేవా సంఘం మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లోని వాసుపల్లి కార్యాలయంలో సోమవారం ఆ సంఘం ప్రతినిధులు గణేష్‌కుమార్‌ను కలిసి మద్దతు తెలిపారు. నిత్యం అందుబాటులో ఉండి, మత్స్యకారుల కోసం శ్రమించే వ్యక్తి వాసుపల్లి గణేష్‌కుమార్ అని, ఆయనను గెలిపించేందుకు లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి కర్రి ఎర్రయ్య, సీహెచ్ భాస్కర రావు, డి. శ్రీనివాసరావు, సీహెచ్ సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు


మిరుమిట్లు గొలిపే విద్యుత్ అలంకరణలో అంబికాబాగ్ రామాలయం

దాబాగార్డెన్స్: శ్రీసీతారామచంద్రస్వామి పెళ్లికి దక్షిణ నియోజకవర్గంలో గల రామాలయాలు సిద్ధమయ్యాయి. అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉగాది పండగ రోజున పెళ్లి రాట వేయడమే గాక పలు రామాలయాల్లో స్వామిని పెళ్లికొడుకును చేశారు. 17న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నియోజకవర్గ పరిధిలోని అన్ని రామాలాయాల్లో రాములోరి పెళ్లి వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలు విద్యుత్ దీపాలంకరణలతో కళకళలాడుతున్నాయి. గత వారం రోజులుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తిరంజని గీతాలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గమంతా పండగే..

నియోజకవర్గంలో గల రామాలయాలన్నీ విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్నాయి. అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం, ప్రకాశరావుపేట రామాలయం, రామజోగిపేట శ్రీరామలింగేశ్వరాలయం, పోలీస్ బ్యారెక్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, ప్రభుత్వ ఘోషాస్పత్రి వద్ద పురాతన సీతారామచంద్రస్వామి ఆలయం, చెంగల్రావుపేట రామాలయం, రెల్లివీధి రామాలయం, కోటవీధి రామాలయం, ఫిషింగ్ హార్బర్ రోడ్డులో గల రామాలయం, మట్టా వెంకటప్ప వీధి(పప్పులవీధి)లో గల రామాలయం, వెలంపేట పెరికివీధి రామాలయం, గొల్లలపాలెం ఉమా రామలింగేశ్వరాలయం, పాత నగరంలో గల పలు రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు.

మంత్రి బొత్సకు 'అప్సా' వినతి

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(అప్సా) ప్రతినిధులు సోమవారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. బదిలీ సర్టిఫికెట్లు, స్టడీ సర్టిఫికెట్ లేకుండా ఎవరు ఏ పాఠశాలలోనైనా అడ్మిషన్ పొందవచ్చని ఇటీవల రాష్ట్ర విద్యా శాఖ ఇచ్చిన జీవో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలకు నష్టం కలిగించేలా ఉందని పేర్కొన్నారు. దీనిపై పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి బొత్స సానుకూలంగా స్పందిస్తూ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్సార్‌సీపీ ఇంటింటా ప్రచారం


నీలకంఠం ఆధ్వర్యంలో వెంకటేశ్వరమెట్టలో ప్రచారంలో చేస్తున్న నాయకులు, కార్యకర్తలు


మిరపకాయల వీధిలో ప్రచారం చేస్తున్న పచ్చిరిపల్లి రాము


ఓట్లు అభ్యర్థిస్తున్న బోరా విజయలక్ష్మి తదితరులు


ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న వార్డు ఇన్‌చార్జ్ అలపన కనకరెడ్డి

అల్లిపురం: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండటంతో పార్టీలు తమ ప్రచారాన్ని విస్తృతం చేశాయి. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బోరా విజయలక్ష్మి, బల్లిగిరి దేవాలయం మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆడారి వెంకట మహేష్ ఆధ్వర్యంలో వార్డులో బంగారమ్మ మెట్ట ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో గైరమ్మ, మంగం పార్వతి, రొంగలి శ్రీనివాసరావు, ఘంటసాల నాగేంద్ర, గజ్జల బాలనారాయణ రెడ్డి పాల్గొన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రామారావు, ఎం.రమేష్ ఆధ్వర్యంలో మిరపకాయలవీధి, పాలసంఘం, మూడుగుళ్లు, గొల్లవీధి తదితర ప్రాంతాలలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి పార్టీని గెలిపించాలని కోరారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ కర్రి నీలకంఠం ఆధ్వర్యంలో వెంకటేశ్వరమెట్టపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డేటి ప్రసాద్, ఎల్లంకి చిన్నమ్ములు, పాల్తేటి ఊర్వశి, శివ, కొడమంచిలి శ్రీను, పిల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

35వ వార్డులో ప్రచారం

జగదాంబ: జనబలమే ముఖ్యమంత్రి జగన్‌కు అండదండలని జీవీఎంసీ 35వ వార్డు ఇన్‌చార్జ్ అలపన కనకరెడ్డి అన్నారు. సోమవారం పండావీధి, ఆయిల్ మిల్లుసందు, పోలింగ్ బూత్‌ల పరిధిలో కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మీ, ఎమ్మెల్యే అభ్యర్థిగా వాసుపల్లి గణేష్‌కుమార్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

వెల్లువలా వైఎస్సార్‌సీపీలోకి..


32వ వార్డు యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి


కొత్త జాలారిపేటకు చెందిన మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి

అల్లిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి యువకులు, మహిళలు వెల్లువలా చేరుతున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ వారిని ఆహ్వానిస్తున్నారు. ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. సోమవారం సాయంత్రం ఆశీలమెట్ట దరి పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలు వార్డుల నుంచి యువకులు పార్టీలో చేరారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వాసుపల్లి కోరారు.

32వ వార్డు నుంచి..

వార్డు యూత్ నాయకుడు మళ్ల కోటి ఆధ్వర్యంలో అల్లిపురం, నేరెళ్లకోనేరుకు, ఏడుగుళ్ల ప్రాంతం నుంచి తాడిపూడి రవికుమార్, పీవీ మహేష్, గరికిన ఎల్లాజీ, బాబులు శ్రీను తదతరులు పార్టీలో చేరారు. వారిని వాసుపల్లి కండువాలతో పార్టీలోకి ఆహ్వానించారు.

30వ వార్డు నుంచి..

కొత్తజాలారిపేటకు చెందిన కూర్మాన నూకరత్నం ఆధ్వర్యంలో భారీగా స్థానిక మహళలు పార్టీలో చేరారు. వారిని వాసుపల్లి కండువాలతో పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కాసారపు లక్ష్మీ, కాసారపు స్వాతి, చింతపల్లి రత్న, లక్ష్మీ, సురకుల ఎల్లాజీ, కే ప్రసాద్, పిల్ల నూకరత్నం, పిల్లా నాయుడమ్మ, సురకల కాంత తదితరులు ఉన్నారు.

38వ వార్డు నుంచి..

వార్డు సీనియర్ నాయకుడు వాసుపల్లి రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్‌కు తన వంతు మద్దతు తెలియజేశారు. ఆయనతో పాటు వార్డు నాయకులు, కార్యకర్తలు ఎస్.శేఖర్, ఎస్.బంగారి, ఎం.రాంబాబు, రాగతి కొండ, రాగతి సత్యరాజు, కరీంబాయ్, రాగతి వేణు, అంబటి నరేష్ తదితరులు మద్దతు తెలియజేశారు. వాసుపల్లి విజయానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు.


వాసుపల్లికి మద్దతు తెలుపుతున్న వాసుపల్లి రాజు


టీడీపీ నేత గండి బాబ్జీ అనుచరులకు పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్


మాసిపోగు రాజు ఆధ్వర్యంలో పార్టీ చేరిన టీడీపీ నేతలను ఆహ్వానించిన వాసుపల్లి గణేష్‌కుమార్

పోటెత్తిన అభిమానం..హోరెత్తిన ప్రచారం


గొందారిగోతుల్లో ప్రచార కరపత్రం అందజేస్తున్న వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్


28వ వార్డులో ప్రచారం చేస్తున్న మండల అధ్యక్షుడు పీతల వాసు


గడప గడపకు వెళ్లి మహిళలకు బొట్టు పెట్టే కార్యక్రమంలో నీలాపు లక్ష్మీ


ఓటు అభ్యర్థిస్తున్న ముజీబ్‌ఖాన్

దాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌లను గెలిపించాలంటూ ఓ వైపు ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతిరోజూ ప్రచారం చేస్తుండగా..మండల అధ్యక్షులు, వార్డుల కార్పొరేటర్లు మరోవైపు వారి వారి వార్డుల్లో ప్రచారం హోరెత్తిస్తున్నారు. వీరికి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.


36వ వార్డులో.. : జీవీఎంసీ 36వ వార్డులో కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్ సోమవారం గొందారిగోతుల్లో పర్యటించి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. డోర్ టు డోర్ ప్రచారంతో పాటు చిరువ్యాపారుల వద్దకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. వార్డు నాయకుడు మాసిపోగు రాజు పాల్గొన్నారు.

29వ వార్డులో..: జీవీఎంసీ 29వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లో మండల అధ్యక్షుడు పీతల వాసు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓల్డ్ ప్రేమా హాస్పటల్, వెంకటపతిరాజునగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, విశాఖ దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌లను గెలిపించాలంటూ ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో పల్లా దుర్గారావు, రాపాక శ్రీనివాస్, నీలాపు లక్ష్మీ, కనకల ఈశ్వర్, కోరాడ సురేష్, బెవర మహేష్, బుల్లెట్ రవి, అడపా శివ, తమ్మినేని శ్రీనివాస్, జయంతి, మేడపాటి సుబ్బారెడ్డి, కర్రి చిన్ని, రమణ, ఉరికిటి శివ, కనకల రాజు, దొప్ప సూరి, శ్రీను, తుపాకుల రమేష్, తాతారావు, వద్దాది శివ, కోరాడ సంతోష్, చిన్నారావు, సాయిబాబా, నందకిషోర్ పలువురు వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఉండమ్మ బొట్టు పెడతా.. : ఉండమ్మ బొట్టు పెడతానంటూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ నీలాపు లక్ష్మి సోమవారం గడప గడపకు వెళ్లి వినూత్నంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

39వ వార్డులో.. : బొత్స ఝాన్సీ, వాసుపల్లి గణేష్‌కుమార్‌కు మద్దతుగా విశాఖ దక్షిణ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ నాయకుడు ముజీబ్‌ఖాన్ పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు. వార్డు పరిధి కోటవీధి, ఫెర్రీరోడ్డు, కదిరి దానప్పవీధి, థామ్సన్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో కమల్, రమణ, సత్య, దూడ తాతారావు, ఇబ్రహీం, వెంకట్, సిలార్ తదితరులు పాల్గొన్నారు.

సేవామూర్తి సాయిపద్మ మృతికి సంతాపం


సాయి పద్మ (ఫైల్)

ఆరిలోవ: గ్లోబల్ ఎయిడ్ సంస్థ వ్యవస్థాపకురాలు సాయి పద్మ(52) సోమవారం మృతి చెందారు. ఆమె ఆరోగ్యం బాగాలేకపోవడంతో కుటుంబ సభ్యులు నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఆమె ఆస్పత్రిలోనే ప్రాణాలు విడిచారు. సాయి పద్మ ఎంవీపీ కాలనీ సెక్టార్-8లో గ్లోబల్ ఎయిడ్ అనే సంస్థ నిర్వహించి పేదలు, బడుగులకు సేవలు అందిస్తున్నారు. ఇలా ఆమె నగరంలో ఎంతో మందికి సుపరిచితులయ్యారు. చిన్నతనంలో జరిగిన ఓ ప్రమాదంలో ఆమె నడవలేని పరిస్థితికి చేరారు. అప్పటి నుంచి ఆమె వీల్‌చైర్‌కే పరిమితమయ్యారు. ఆమె సేవామూర్తిగా మాత్రమే కాకుండా న్యాయవాది, రచయిత, రీడర్, గాయని, పారా ఎయిర్ రైఫిల్ షూటర్‌గా ఎంతో మందికి పరిచయస్తురాలు. ఆమె మృతి విషయం తెలుసుకున్న ప్రముఖులు, పరిచయస్తులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.